14-09-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

**" మధురమైన పిల్లలారా - మీరిప్పుడు సత్యమైన పాఠశాలలో కూర్చొని ఉన్నారు. ఇది సత్సంగము కూడా. ఇక్కడ మీకు తీరానికి చేర్చే సత్యమైన తండ్రి సాంగత్యము లభించింది "**

**ప్రశ్న:-** లెక్కాచారాల ఆట గురించి మానవులు తెలుసుకున్న దానికి, మీరు తెలుసుకున్న దానికి గల తేడా ఏమిటి?

**జవాబు:-** మానవులు ఇది సుఖ-దుఃఖాల ఆట అని, సుఖ-దుఃఖాలు పరమాత్ముడు ఇచ్చినవే అని భావిస్తారు. కాని ఇది ప్రతి ఒక్కరి కర్మ లెక్కాచారాల ఆట అని మీరు అర్థము చేసుకున్నారు. తండ్రి ఎవ్వరికీ దుఃఖమునివ్వరు. వారు సుఖమునిచ్చే దారిని తెలిపేందుకే వస్తారు. పిల్లలూ! నేను ఎవ్వరినీ దుఃఖితులుగా చెయ్యను, ఇది మీ కర్మల ఫలమే అని తండ్రి చెప్తున్నారు.

**పాట:- ఈ పాప ప్రపంచము నుండి దూరంగా ఎక్కడికైనా తీసుకెళ్ళు..... (ఇస్ పాప్ కి దునియా సే....)**

**ఓంశాంతి.** మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలు పాట విన్నారు. ఎవరిని పిలుస్తున్నారు? తండ్రిని. బాబా మీరు వచ్చి మమ్ములను ఈ పాప కలియుగ ప్రపంచము నుండి పుణ్య సత్యయుగ ప్రపంచానికి తీసుకెళ్లమని పిలుస్తారు. ఇప్పుడు జీవాత్మలందరూ కలియుగములో ఉన్నారు. ఈ పాట విన్నప్పుడు వారి బుద్ధి పైకి పోతుంది. తండ్రి అంటున్నారు - నేను ఎవరో, ఎలా ఉన్నానో ఎవ్వరికీ తెలియదు. ఋషులు - మునులు కూడా మాకు రచయిత మాలికుడు అనగా అనంతమైన తండ్రి గురించి, వారి అనంతమైన రచనల ఆది-మధ్య-అంతముల గురించి తెలియదని అంటారు. ఆత్మలెక్కడ ఉంటాయో అది బ్రహ్మ మహాతత్వము. అక్కడ సూర్య-చంద్రులుండరు, మూలవతనములోనూ ఉండరు, సూక్ష్మ వతనములోనూ ఉండరు. పోతే ఈ నాటక రంగములో కరెంటు మొదలైనవన్నీ కావాలి కదా. కావున ఈ నాటకరంగానికి రాత్రి పూట చంద్రుడు, నక్షత్రాల ద్వారా, పగలు సూర్యుని ద్వారా కరెంటు(ప్రకాశము, వెలుతురు) లభిస్తుంది. ఈ బల్బులు, ఈ దీపాలు ఉన్నా అంధకారమని అంటారు. రాత్రి దీపాలు వెలిగించాల్సి ఉంటుంది. సత్య-త్రేతా యుగాలను పగలని, భక్తి మార్గమును రాత్రి అని అంటారు. ఇది కూడా అర్థము చేసుకునే విషయము. నూతన ప్రపంచము మళ్లీ తప్పకుండా పాత ప్రపంచంగా అవుతుంది. కొత్తదిగా అయినప్పుడు పాతది తప్పకుండా వినాశనమవుతుంది. ఇది అనంతమైన ప్రపంచము. రాజులు మొదలైన వారి భవనాలు చాలా పెద్ద పెద్దవిగా ఉంటాయి. ఇది అనంతమైన ఇల్లు. నాటక రంగమనగా స్టేజి లేక కర్మక్షేత్రమని కూడా అంటారు. కర్మలు తప్పకుండా చేసే తీరాలి. మనుష్యులందరికీ ఇది కర్మక్షేత్రము. అందరూ కర్మలు చేసే తీరాలి. పాత్రను అభినయించే తీరాలి. ప్రతి ఆత్మకు ముందే పాత్ర లభించి ఉంది. మీలో కూడా బాగా అర్థము చేసుకునేవారు కొంతమంది మాత్రమే ఉన్నారు. వాస్తవానికి ఇది గీతా పాఠశాల. పాఠశాలలో ఎప్పుడైనా ముసలివారు మొదలైనవారు చదువుకుంటారా? ఇక్కడ ముసలివారు, యుక్త వయస్కులు మొదలైన వారందరూ చదువుకుంటారు. ఇది వేద పాఠశాల కాదు. అక్కడ ఏ లక్ష్యమూ ఉండదు. వేద శాస్త్రాలు చదివినందున వాటి ద్వారా ఏం లాభమో ఎలా అవుతారో వారికి తెలియదు. ఏ సత్సంగంలోనూ లక్ష్యమంటూ ఏదీ లేదు. ఇప్పుడు వాటిని సత్సంగము అనేందుకు సిగ్గు అవుతుంది. సత్యమైనవారు ఒక్క తండ్రి మాత్రమే. అందుకే మంచి సాంగత్యము తేలుస్తుంది - చెడు సాంగత్యము ముంచుతుంది..... అని అంటారు.

కుసంగమనగా కలియుగ మనుష్యుల సాంగత్యము. సత్సంగము ఇది ఒక్కటే. ఇప్పుడు మీకు అద్భుతమనిపిస్తుంది. సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని తండ్రి మీకిస్తారు. మీకు ఎంతో సంతోషము కలగాలి. మీరు సత్య-సత్యమైన పాఠశాలలో కూర్చొని ఉన్నారు. మిగిలినవన్నీ అసత్యమైన పాఠశాలలు. ఆ సత్సంగాలు మొదలైన వాటి ద్వారా మీరు శ్రేష్ఠంగా అవ్వరు. పాఠశాలలు, కాలేజీల ద్వారా చదువుకొని ఏదో ఒకటిగా అవుతారు. ఎందుకంటే అక్కడ చదువుకుంటారు. ఇతర చోట్ల ఎక్కడా చదువు లేదు. సత్సంగాన్ని చదువు అని అనరు. శాస్త్రాలు మొదలైనవి చదువుకొని దుకాణాలు తెరచి కూర్చుని ధనము సంపాదిస్తారు. కొద్దిగా గ్రంథ్(సిక్కుల ధర్మశాస్త్రమైన గ్రంథ్ సాహెబ్)ను నేర్చుకొని గురుద్వారాలు తెరచి కూర్చుంటారు. అనేక గురుద్వారాలను తెరుస్తారు. గురుద్వారమనగా గురువు ఇల్లు అని అంటారు కదా. తలుపులు తెరుచుకుంటూనే అక్కడికెళ్ళి శాస్త్రాలు మొదలైనవి చదువుకుంటారు. మీ గురుద్వారాలు - ముక్తి, జీవన్ముక్తిధామాలు. అదే సద్గురు ద్వారము. సద్గురువు పేరు ఏది? అకాలమూర్తి. సద్గురువును అకాలమూర్తి అని అంటారు. వారు వచ్చి ముక్తి-జీవన్ముక్తి ద్వారాలను తెరుస్తారు. వారు అకాలమూర్తి కదా. వారిని మృత్యువు కూడా కబళించలేదు. ఆత్మ ఒక బిందువు దానిని కాలుడెలా కబళిస్తాడు? ఆత్మ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. పాత శరీరాన్ని వదలి క్రొత్తది తీసుకుంటుంది, కనుక ఇందులో ఏడ్చే అవసరమేముంది? అని మనుష్యులకు కొంచెము కూడా తెలియదు. ఇది అనాదిగా తయారైన డ్రామా అని, ప్రతి ఒక్కరు పాత్రను అభినయించే తీరాలని మీకు తెలుసు. సత్యయుగంలో నిర్మోహులుగా(నష్టోమోహులుగా) ఉంటారని తండ్రి అర్థం చేయించారు. మోహజీత్ కథ ఉంది కదా. పండితులు ఈ కథను వినిపిస్తారు. మాతలు విని విని వారు కూడా గ్రంథము పట్టుకొని ఇతరులకు వినిపించేందుకు కూర్చుంటారు. అక్కడకు అనేకమంది మనుష్యులు వెళ్ళి వింటారు. దానిని చెవులకు ఇంపైన కర్ణ రసమని అంటారు. డ్రామా ప్లాను అనుసారము మా దోషమేముంది? అని మనుష్యులంటారు. తండ్రి అంటారు - ఈ దుఃఖ ప్రపంచము నుండి తీసుకెళ్ళమని నన్ను పిలుస్తారు. ఇప్పుడు నేను వచ్చాను. కావున నా మాట వినాలి కదా. తండ్రి కూర్చొని పిల్లలకు " మంచి మతము లభిస్తే వినాలి కదా " అని చెప్తున్నారు. దోషము మీది కూడా కాదు. ఇది కూడా డ్రామానే. ఇది తయారైన రామరాజ్యము, రావణ రాజ్యముల ఆట. ఆటలో ఎవరైనా ఓడిపోతే వారి దోషమేమీ లేదు. గెలుపు - ఓటములు జరుగుతూనే ఉంటాయి. కాని ఇందులో యుద్ధము మాటే లేదు. మీకు చక్రవర్తి పదవి ఉండేది. ఇది కూడా ఇంతకు ముందు మీకు తెలియదు. ఇప్పుడు ఎవరు సేవాధారులుగా ఉన్నారో ఎవరి పేరు ప్రసిద్ధంగా ఉందో మీకు తెలుసు. ఢిల్లీలో అందరికంటే బాగా అర్థము చేయించే వారెవరు? వెంటనే జగదీష్ భాయి పేరు వస్తుంది. అతను మీ కొరకు మ్యాగజైన్ కూడా వ్రాస్తారు. అందులో జ్ఞానమంతా వచ్చేస్తుంది. అనేక రకాలైన పాయింట్లు వ్రాస్తారు. బ్రిజ్‌మోహన్ కూడా వ్రాస్తారు. వ్రాయడం పిన్నమ్మ ఇల్లేమీ కాదు (సులభం కాదు). విచార సాగర మథనము తప్పకుండా చేయవలసి వస్తుంది. వారు సేవ బాగా చేస్తారు. అనేకమంది చదువుకొని సంతోషిస్తారు. పిల్లలకు కూడా రిఫ్రెష్‌మెంటు(తాజాతనము) లభిస్తుంది. కొంతమంది ప్రదర్శినీలో తల బాదుకుంటారు. కొంతమంది కర్మ బంధనాలలో చిక్కుకొని ఉన్నారు, అందుకే అంత ఎక్కువగా జ్ఞానము తీసుకోలేరు. ఇది కూడా డ్రామానే. అబలల పైన అత్యాచారాలు జరగడం కూడా డ్రామాలో రచింపబడి ఉంది. మాకే ఇలాంటి పాత్ర ఎందుకు లభించిందని అనుకోరాదు. ఇది అనాదిలో తయారైన డ్రామా. దానిని ఏమీ చేయలేము.

ఇలాంటి పాత్ర లభించేందుకు మేము ఏం తప్పు చేశామని కొందరంటారు. ఇందులో తప్పు మాటే లేదు. ఇది కూడా ఒక పాత్ర, అబలలు కష్టాలు అనుభవించేందుకు ఎవరో ఒకరు నిమిత్తంగా అవుతారు. అలాగైతే అందరూ నాకు ఈ పాత్ర ఎందుకు లభించదని అంటారు. అలా జరగదు. ఇది తయారైన డ్రామా. పురుషుల పైన కూడా అత్యాచారాలు జరుగుతాయి. ఈ విషయాలలో చాలా సహన శక్తి ఉండాలి. సహనశీలత చాలా అవసరము. మాయ చాలా విఘ్నాలు కలిగిస్తుంది. విశ్వ చక్రవర్తి పదవి పొందేందుకు కొంత శ్రమ చేయాల్సి వస్తుంది. డ్రామాలో ఆపదలు, కష్టాలు మొదలైనవి చాలా ఉన్నాయి. అబలల పై అత్యాచారాలు రచింపబడి ఉన్నాయి. రక్తపు నదులు కూడా ప్రవహిస్తాయి. ఎక్కడా రక్షణ దొరకదు. ఇప్పుడింకా ఉదయం క్లాసులు మొదలైనవాటికి సెంటర్లకు వెళ్తున్నారు. మీరు బయటకు కూడా రాలేని సమయము వస్తుంది. పోను పోను రోజులు గడిచే కొలది ప్రపంచము చెడిపోతూ ఉంటుంది. ఇంకా పాడైపోవాల్సిందే. దుఃఖము కలిగించే రోజులు చాలా జోరుగా వస్తాయి. జబ్బులు మొదలైన వాటిలో దుఃఖము కలిగినప్పుడు భగవంతుని తల్చుకుంటూ పిలుస్తారు. ఇక కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉందని మీకిప్పుడు తెలుసు. తర్వాత మనము మన శాంతిధామానికి, సుఖధామానికి తప్పకుండా వెళ్ళిపోతాము. ఇది కూడా ప్రపంచములోని వారికి తెలియదు. పిల్లలైన మీరిప్పుడు అనుభవము చేస్తున్నారు కదా. ఇప్పుడు మీరు తండ్రిని పూర్తిగా తెలుసుకున్నారు. వారంతా పరమాత్ముడంటే లింగ రూపమని భావిస్తారు. శివలింగాన్ని పూజ కూడా చేస్తారు. మీరు కూడా శివుని మందిరానికి వెళ్ళేవారు. అప్పుడు శివలింగమంటే ఏమిటో ఎప్పుడైనా ఆలోచించారా? అది జడమైతే, చైతన్యములో కూడా తప్పకుండా ఉంటుంది కదా. అయితే అది ఏమిటి? భగవంతుడనగా పైన ఉండే రచయిత. వారిని పూజించేందుకు ఈ లింగము కేవలం ఒక గుర్తు మాత్రమే. మీరు పూజ్యులుగా అయితే, తర్వాత ఈ చిత్రాలేవీ ఉండవు. కాశీలో శివుని మందిరానికి వెళ్తారు. అయితే భగవంతుడు నిరాకారుడని, మనమంతా వారి పిల్లలమే అని కూడా ఎవ్వరికీ తెలియదు. ఆ తండ్రికి పిల్లలై ఉండి కూడా మనకు దుఃఖము ఎందుకు? - ఇది ఆలోచించే విషయము కదా. మనము పరమాత్ముని సంతానము కదా. అయితే దుఃఖము ఎందుకు? అని ఆత్మ అంటుంది. తండ్రి సుఖమునిచ్చేవారు. ఓ భగవంతుడా! మా దుఃఖాలు హరించు తండ్రీ అని పిలుస్తారు. కాని దుఃఖాన్ని వారెలా నశింపజేస్తారు? సుఖ-దుఃఖాలు మీ కర్మల లెక్కాచారాలు. సుఖానికి ఫలము సుఖము. దుఃఖానికి ఫలము దుఃఖము పరమాత్ముడే ఇస్తారని మానవులు అనుకుంటారు. అన్నీ వారి పై ఉంచుతారు. కాని తండ్రి చెప్తున్నారు - నేను ఎప్పుడూ దుఃఖమునివ్వను. నేను అర్ధకల్పానికి సుఖమునిచ్చి వెళ్ళిపోతాను. ఇది సుఖ-దుఃఖాల ఆట. డ్రామాలో కేవలం సుఖమే ఉంటే, భక్తి మొదలైనవన్నీ ఉండేవి కావు. భక్తి మొదలైనవన్నీ భగవంతుని కలుసుకునేందుకే చేస్తారు కదా. ఇప్పుడు తండ్రి కూర్చొని మొత్తం విషయమంతా వినిపిస్తారు. పిల్లలైన మీరు ఎంతో భాగ్యశాలురని తండ్రి చెప్తున్నారు. ఆ ఋషులు-మునులు మొదలైనవారికి ఎంతో గొప్ప పేరు ప్రఖ్యాతులున్నాయి. మీరు రాజఋషులు, వారు హఠయోగ ఋషులు. ఋషులు అనగా పవిత్రులు. మీరు స్వర్గములో రాజులుగా అవుతారు. అందుకొరకు తప్పకుండా పవిత్రంగా అవ్వాలి. సత్య-త్రేతా యుగాలలో ఎవరి రాజ్యముండేదో మళ్ళీ వారి రాజ్యమే ఉంటుంది. మిగిలినవారంతా తర్వాత వస్తారు. మేము శ్రీమతమునననుసరించి మా రాజ్యమును స్థాపిస్తున్నామని మీరిప్పుడు అంటారు. పాత ప్రపంచము వినాశనమయ్యేందుకు కూడా

సమయం పడ్తుంది కదా. సత్యయుగము వస్తుంది. కలియుగము పోతుంది.

ఈ ప్రపంచము ఎంత పెద్దది! ఒక్కొక్క పట్టణంలో ఎంతమంది మనుష్యులున్నారు! ధనవంతులు ప్రపంచమంతా తిరుగుతారు. కాని మొత్తం ప్రపంచాన్ని ఎవ్వరూ చూడలేరు. సత్యయుగంలో అయితే చూడగలరు. ఎందుకనగా సత్యయుగములో ఉండేది ఒకే రాజ్యము. రాజులు కొద్దిమందే ఉంటారు. ఇక్కడ ఈ ప్రపంచమెంత పెద్దదిగా ఉందో చూడండి. ఇంత పెద్ద ప్రపంచాన్ని ఎవరు తిరుగుతారు. అక్కడ మీరు సముద్రములోకి వెళ్ళే అవసరమే ఉండదు. అచ్చట సిలోను, బర్మా మొదలైనవి ఉంటాయా? ఉండవు. ఇవేవీ ఉండవు. ఈ కరాచీ కూడా ఉండదు. మీరంతా మంచి నీటి నదీ తీరాలలో నివసిస్తారు. వ్యవసాయము మొదలైనవన్నీ ఉంటాయి. సృష్టి చాలా పెద్దది. మనుష్యులు చాలా తక్కువ మంది ఉంటారు. తర్వాత వృద్ధి చెందుతారు. అప్పుడక్కడకు వెళ్ళి తమ రాజ్యాలను స్థాపించుకుంటారు. మెల్ల మెల్లగా ఆక్రమిస్తూ, వారి రాజ్య స్థాపన చేసుకున్నారు. ఇప్పుడు దీనినంతటినీ వదిలిపెట్టాల్సిందే. ఎవరి రాజ్యమూ దోచుకోనిది ఒక్క భారతదేశము మాత్రమే. ఎందుకంటే భారతదేశము అహింసా రాజ్యము కదా. భారతదేశమే ప్రపంచమంతటికీ అధికారిగా ఉండేది. మిగిలినవన్నీ తర్వాత వచ్చినవే. ముక్కలు-ముక్కలుగా చేసుకొని తీసుకుంటూ వచ్చారు. మీరు ఇతరులది ఆక్రమించలేదు. ఇంగ్లీషు వారు ఆక్రమించుకున్నారు. భారతవాసులైన మిమ్ములను తండ్రి విశ్వానికి అధికారులుగా చేశారు. మీరెక్కడకూ వెళ్లలేదు. పిల్లలైన మీ బుద్ధిలో ఈ మాటలన్నీ ఉన్నాయి. వృద్ధ మాతలకు ఈ విషయాలన్నీ అర్థము కావు. తండ్రి అంటున్నారు - మీకు చదువురానిది కూడా మంచికే. చదివినవారైతే బుద్ధి నుండి దానినంతా తీసేయాల్సి వస్తుంది. ఒక విషయాన్ని మాత్రము ధారణ చేయాలి - " మధురమైన పిల్లలూ! తండ్రిని స్మృతి చేయండి. " బాబా మీరు వస్తే సమర్పణౌతాము, బలిహారి అవుతాము అని మీరు అంటూ వచ్చారు కదా. కనుక మీరు నా పై సమర్పణ అవ్వాలి. ఇచ్చి-పుచ్చుకోవడముంటుంది కదా. వివాహ సమయంలో స్త్రీ-పురుషులిరువురు, పరస్పరము ఒకరి చేతిలో ఒకరు ఉప్పు పెట్టుకుంటారు(ఉప్పేనుగ-పప్పేనుగ). తండ్రితో కూడా - బాబా మేము మా పాతదంతా ఇచ్చేస్తామని అంటారు. తప్పకుండా మరణించాల్సిందే. ఇదంతా సమాప్తమవ్వాల్సిందే. మీరు మాకు మళ్లీ నూతన ప్రపంచములో ఇవ్వాలి. అందరినీ తీసుకొని వెళ్లేందుకే తండ్రి వస్తారు. వారు కాలుడు కదా. సింధీలో అందరినీ తీసుకొని వెళ్ళే ఈ కాలుడెవరు? అని అంటారు. పిల్లలైన మీరు సంతోషిస్తారు. తండ్రి తీసుకెళ్లేందుకే వస్తారు. మనము సంతోషంగా మన ఇంటికి వెళ్ళిపోతాము. సహనము కూడా చేయవలసి ఉంటుంది. మంచి-మంచి గొప్ప ఇంటి మాతలు కూడా దెబ్బలు(తన్నులు) తింటారు. మీరు సత్యమైన సంపాదన చేసుకుంటున్నారు. కలియుగంలో శూద్ర సంప్రదాయము వారమని వారికి తెలియదు. మీరు సంగమ యుగంలో పురుషోత్తములుగా అవుతున్నారు. మొదటి నంబరు పురుషోత్తములు ఈ లక్ష్మీనారాయణులని తెలుసు కదా. తర్వాత డిగ్రీ తగ్గిపోతూ వస్తుంది. పై నుండి క్రిందకు వస్తూ ఉంటారు. నెమ్మది-నెమ్మదిగా క్రిందకు దిగజారుతూ ఉంటారు. ఈ సమయంలో అందరూ క్రింద పడి ఉన్నారు. వృక్షము పాతదైపోయింది. కాండము శిథిలమైపోయింది. ఇప్పుడు మళ్లీ స్థాపనవుతుంది. పునాది ఏర్పడ్తుంది కదా. మొలక(నాటు) చాలా చిన్నదిగా ఉంటుంది. దాని నుండి పెద్ద వృక్షమవుతుంది. ఇది కూడా ఒక వృక్షమే. సత్యయుగంలో వృక్షము చాలా చిన్నదిగా ఉంటుంది. ఇప్పుడెంత పెద్ద వృక్షమైపోయింది! మానవ సృష్టిలో ఎన్ని వెరైటీ

పుష్పాలు ఉన్నాయో చూడండి. ఒకే వృక్షములో ఎన్నో రకాల పుష్పాలున్నాయి. ఇది మనుష్యుల అనేక వెరైటీ ధర్మాల వృక్షము. ఒకరి ముఖము మరొకరి ముఖము వలె ఉండదు. ఇది తయారైన డ్రామా కదా. అందరి పాత్ర ఒకే విధంగా ఉండేందుకు వీలు లేదు. దీనిని తయారైన ప్రాకృతిక డ్రామా అని అంటారు. ఇందులో కూడా అనేక విధాలైన కృత్రిమాలున్నాయి. నిజమైన వస్తువులు కూడా నశిస్తాయి. మళ్లీ 5 వేల సంవత్సరాల తర్వాత అవి నిజంగా వస్తాయి. చిత్రాలు మొదలైనవి కూడా నిజమైనవి లేనే లేవు. ఈ బ్రహ్మా ముఖమును కూడా మీరు 5 వేల సంవత్సరాల తర్వాతనే చూస్తారు. ఈ డ్రామా రహస్యాన్ని అర్థము చేసుకునేందుకు బుద్ధి చాలా విశాలంగా ఉండాలి. ఏది అర్థము కాకున్నా ఒక్క విషయము మాత్రము బుద్ధిలో ఉంచుకోండి - "నాకు ఒక్క శివబాబా తప్ప మరెవ్వరూ లేరు." ఆత్మ అంటుంది - "బాబా మేము మిమ్ములనే స్మృతి చేస్తాము." ఇది సులభమే కదా. చేతులతో పనులు చేస్తూ ఉండండి. బుద్ధితో స్మృతి చేస్తూ ఉండండి. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. సహనశీలత గుణాన్ని ధారణ చేసి మాయ కలిగించే విఘ్నాలలో పాస్ అవ్వాలి. అనేక ఆపదలు వస్తాయి. అత్యాచారాలు జరుగుతాయి. అటువంటి సమయములోనే సహనము చేస్తూ తండ్రి స్మృతిలో ఉండాలి. సత్యమైన సంపాదన చేసుకోవాలి.

2. విశాలబుద్ధి కలిగి ఈ తయారైన డ్రామాను బాగా అర్థము చేసుకోవాలి. ఇది తయారైన ప్రాకృతిక డ్రామా. అందువలన ఇందులో ప్రశ్నలే రాకూడదు. తండ్రి తెలిపిన శ్రేష్ఠ మతమును అనుసరిస్తూ ఉండాలి.

## వరదానము :- " తండ్రి సమానం వరదానులుగా అయి ప్రతిఒక్కరి మనసుకు శాంతినిచ్చే మాస్టర్ దిలారాం భవ "

ఎవరైతే తండ్రి సమానం వరదాని మూర్త్ పిల్లలుగా ఉంటారో వారు ఎప్పుడు ఎవ్వరి బలహీనతలను చూడరు. వారు అందరి పై దయాహృదయులుగా ఉంటారు. ఎలాగైతే తండ్రి ఎవ్వరి బలహీనతలను మనసులో ఉంచుకోరో, అలా వరదాని పిల్లలు కూడా ఎవ్వరి బలహీనతను మనసులో ధారణ చెయ్యరు. వారు ప్రతి ఒక్కరి మనసుకు విశ్రాంతి(ఆరామ్)నిచ్చే మాస్టర్ దాతలుగా ఉంటారు. అందువలన సాథీలు గాని, ప్రజలు గాని అందరు వారి గుణగానము చేస్తారు. అందరి ఆంతరికము నుండి వీరు సదా మా స్నేహీలు సదా యోగులు అని ఆశీర్వాదాలు వెలువడ్తాయి.

## స్లోగన్:- " సంగమ యుగంలో ఎవరైతే సదా చింతలేని చక్రవర్తులుగా ఉంటారో, వారే శ్రేష్ఠమైన ఆత్మలు. "